
# అమ్మ కావాలి...

ఎల్. సుకన్య



లుఫ్తారిజితో మద్రాసు నుంచి ఫ్రాంక్‌ఫర్టుకి అక్కడినుంచి చికాగోకి ప్రయాణం. తప్పనిసరి ప్రయాణం. ఇష్టం లేని ప్రయాణం. ఆనందంగా వున్నట్లుగా చేస్తున్న ప్రయాణం. ఇలా గాలిలో ఎగురుతూ ప్రయాణం చేయడం ఇది రెండోసారి. మొదటిసారి విమానం ఎక్కుతున్నప్పుడు ఎత్తయిన పర్వత శిఖరాన్ని అధిరోహిస్తున్నట్లు, జీవితంలో వున్నతమైన స్థానాన్ని అందుకుంటున్నట్లు గర్వపడింది.

చికాగో నగరాన్ని చూసి అబ్బురపడింది. భారత దేశం మరో వంద సంవత్సరాలుగడిచినా ఇంత అభివృద్ధి చెందలేదని, ఆంధ్రదేశం మారుమూల పల్లెటూరిలాగా వుంటుందని భావించింది. పిట్స్‌బర్గ్ ఆలయంలో కొడుకు మోహనకృష్ణ తను ప్రేమించిన అమ్మాయి నవతను పెళ్లిచేసుకుంటున్నప్పుడు తన కొడుకు చాలా దశమంతుడని, సమానంగా చదువుకొని ఉద్యోగం చేస్తున్న ఆ అమ్మాయి తన పూజల పుణ్యఫలమని తలపోసింది.

అసలు మోహనకృష్ణ అమెరికా వెళ్లడం ఎంతో అద్భుతమైన అంశం. అమెరికాలో చదువుతాడని, మంచి ఉద్యోగంలో స్థిరపడతాడని, తాను చికాగో నడి వీధిలో కాలు పెడుతుందని ఏనాడు అనుకోలేదు. జమ్ములపాలెంలో పుట్టిపెరిగి, బెంగుళూరులో కొడుకు ఇంజనీరింగ్ చదివినందుకే కొడుకు తెలివితేటలకి మహా మురిసిపోయింది. బెంగుళూరు స్నేహితులతో కలిసి అమెరికాలో పై చదువులు చదువుతానంటే, తాను ఆర్థిక పరిస్థితుల్ని అంచనా వేసుకుంటూ వెనకాడుతున్నప్పుడు అమ్మ ప్రోత్సహించింది. వీసా వచ్చిందని మోహనకృష్ణ సంతోషపడితే అంతకంటే అధికంగా అమ్మ, తాను సంబరపడ్డారు. పై చదువుల కోసం బ్యాంక్ అప్పులిస్తుందంటే ఎక్కడ కావాలంటే అక్కడ ఆలోచించకుండా సంతకాలు పెట్టారు. బాపట్లలో మద్రాసు ఎక్స్‌ప్రెస్ ఎక్కించి భారమైన గుండెలతో వెనుదిరిగారు. 'పిచ్చి తండ్రి సముద్రాలు దాటి దూరంగా వెడుతున్నాడు. మళ్లీ ఎప్పటికి కనపడతాడో' అనుకున్నప్పుడు ఆ మాటే అమ్మ పైకి అన్నప్పుడు 'వాడిని చల్లగా చూడమని' వెంకన్నను వేడుకొని గుండెల్ని తేలకపరుచుకున్నారు.

ఆ తర్వాత అమ్మ వాడికోసం, ఎంత బెంగపడిందో? వాడి దగ్గర నుంచి సరిగా కబురు అందక, ఎవర్ని అడగాలో అర్థంకాక, ప్రతిక్షణం బాధపడింది. ప్రతిపూట ప్రతి అన్నంమెతుకుని వాడిని తలుచుకుంటూ మింగేది.

అమ్మకి వాడంటే ఎంత ప్రేమ? అమ్మమ్మగా వాడికి ఎన్ని సపర్యలు చేసింది? ఐదు రోజుల పసి గుడ్డుకు నూనెరాసి, నలుగుపెట్టి స్నానాలు చేయించింది. ఆనాటి నుంచి వాడు ఇరవై ఒకటవ ఏట అమెరికా వెళ్లే వరకూ వాడు ఎప్పుడు పాలెం వచ్చినా వదిలేది కాదు. నలుగుతో స్నానం చేస్తే మెరుపు వస్తుంది, నునుపు వస్తుందంటూ వాడు వద్దని మొత్తుకుంటున్నా, వినకుండా లాక్కెళ్లి ముక్కాలి పీట మీద కూచోపెట్టి నలుగుతో స్నానం చేయించేది. ఆ తర్వాత సాంబ్రాణి ధూపం వేసి, వాడిని చూసుకొని మురిసిపోయేది. ఇరుగు పొరుగు దిష్టిపెట్టారని, తన దిష్టి కూడా తగిలిందని ఉప్పు కల్లుతో దిష్టి తీసేది.

అమ్మగా తను వాడికి చేసిన దానికంటే, అమ్మమ్మగా అమ్మ చేసింది చాలా ఎక్కువ. వాడు వూళ్లో అడుగు పెడితే చాలు ఏదోక వంకతో పదిమందికి భోజనాలు పెట్టేది. కడుపునిండా భోజనం చేసి అందరూ తన మనుమడిని దీవిస్తే వాడికి మేలు జరుగుతుందని అమ్మకి ఎంత నమ్మకమో? అమ్మ చేతి పిండివంటలు మహా రుచిగా వుంటాయి. అందులోనూ సున్ని వుండలు చేయడంలో అమ్మకు అమ్మేసాటి. విసిరిన సున్నిలో వేడి వేడి నెయ్యి, బెల్లం, యాలకుల పోడి కలిపి వుండలు చుడితే, ఆ చేతిలోని మహత్యమేమిటో గానీ అద్భుతమైన రుచి. అవే సున్ని వుండలు తను చుడితే ఆ రుచి మరోలా వుంటుంది. ఏమిటో మరి.

అమ్మ నలుగురికి దగ్గర చేర్చుకొని, మనుమడి కబుర్లు మరీ మరీ చెప్పి ఆనందిస్తే, తాను పదుగురు పిల్లలకు టీచర్‌గా కథలు చెప్పి, కథల్లా చదువులు చెప్పి, మోహన్‌కృష్ణకు దూరంగా వున్నాననే విషయాన్ని మరిచిపోవాలని ప్రయత్నం చేసేది. వాడు పంపిన ఫోటోలను చూసుకొని ఇద్దరు మురిసిపోయేవారు. ఆరోజు అమ్మకి బాగా జ్వరం వచ్చింది. ఏనాడు అమ్మ జ్వరపడ్డ మనిషి కాదు. తలంతా ఏమిటో తిమ్మిరి తిమ్మిరిగా వుందన్నది. వెంటనే వూర్లోని డాక్టరుకు చూపిస్తే, బిపి చాలా వుంది ముందు బిపి కంట్రోలు కావాలంటూ మందు వాడారు. రెండు రోజులయినా బిపి నిలకడగా వుండడం లేదు. బాపట్లగాని, గుంటూరు గాని తీసుకెళ్లి నర్సింగ్‌హోంలో చేర్పించి ట్రీట్‌మెంట్ చేయిస్తే మంచిదన్నారు. రెండురోజుల్లోనే మనిషిలో ఎంతో మార్పు. వెంటనే జీపులో అమ్మను తీసుకుని గుంటూరు చేరింది. ప్రసాద్‌రావు గారు మంచి డాక్టరు. ఆయనది మంచి హస్తవాసి అంటారు. అమ్మను పరిశీలించి 'పెద్ద వయసు కదా, కొంచెం టైం తీసుకుంటుంది. కంగారు పడవద్దని' తన నర్సింగ్ హోంలో చేర్చుకున్నారు.



మర్నాడే అడిగింది అమ్మ. ''మోహనకృష్ణని ఒకసారి వచ్చి నా కళ్లకు కనిపించమని చెప్పు ఫోన్ చేసి. చూసి చాలారోజులైంది. నేను వుంటానో, వుండనో...''

''అలా అనకమ్మా. బి.పి.యే కదా తగ్గుతుంది.''

''నీకు తెలియదే సంధ్యమ్మా. ఇది మాయదారి రోగం. పైకి కనిపించదు. ప్రాణాల్ని ఎప్పుడో ఛట్న తీసేస్తుంది. నాకు వాడిని చూడాలని వుంది. నేను పోయాననుకో వాడిని నేను చూడలేను కదా''

''అలా అనకమ్మా..''

''వాడిని చూసి నాలుగేళ్లు అయింది. ఒక బిడ్డకు తండ్రి కూడా అయ్యాడు. ఆనాడు చదువుల కోసం వెళ్లిన వాడు మళ్లీ ఈ గడ్డమీద కాలు పెట్టనేలేదు. వాడికి ఎన్ని సమస్యలున్నాయో? మనకేం తెలుసు? పెద్ద ఉద్యోగస్తుడు కదా? బోలెడన్ని సమస్యలుంటాయి.''

''అందుకే నీకు నెమ్మదించాక చేస్తాను. నీకు బాగోలేదంటే కంగారు పడతాడు.''

అమ్మ చిన్నగా నవ్వింది. ''నాకు తెల్సే. నా పిచ్చితండ్రికి నేనంటే ప్రాణం. కానీ నాకు కన్ను మూతపడడం లేదే సంధ్యమ్మా. పోనీ కనీసం ఫోన్ దగ్గరకు తీసుకెళ్లు. వాడి గొంతు విని తృప్తిపడతాను. అమ్మమ్మ అనే వాడి పిలుపు చాలు..''

తనకు ఏడుపు ముంచుకు వచ్చింది. ఏం

**అమ్మ వాడికోసం, ఎంత బెంగపడిందో? వాడి దగ్గర నుంచి సరిగా కబురు అందక, ఎవర్ని అడగాలో అర్థంకాక, ప్రతిక్షణం బాధపడింది. ప్రతి పూట ప్రతి అన్నం మెతుకుని వాడిని తలుచుకుంటూ మింగేది.**

చెయ్యాలో తోచలేదు. అమ్మ మరీ ఇంతగా మను మడి కోసం కలవరించలేదు.

''అయినా నేనెప్పుడైనా ఆస్పత్రి ముఖం ఎరుగున్నానే సంధ్యమ్మా. చెప్పు''

నిజమే- అమ్మ ఎప్పుడూ తలనొప్పితో కూడా బాధపడినట్లు గుర్తులేదు. సన్నగా రివటాలా గట్టిగా వుంటుంది.

పెద్దది, పాపం ఇంతగా అడుగుతోంది. ఒకసారి ఫోన్ చేసి అమ్మకి బాగా లేదని చెబితే రెక్కలు గట్టుకొని నాలుగురోజుల్లో వాలతాడు. వాడు మళ్లీ రాలేదని వూర్లో అందరూ అడుగుతున్నారు కూడా.

అమ్మ నిద్రపోయాక నెమ్మదిగా లేచి బయట ఎస్టీడి బూత్ దగ్గరకు వెళ్లింది.

మోహనకృష్ణకు విషయమంతా వివరించి చెప్పింది. ''మనుమడిని, కోడలిని కూడా తీసుకుని వస్తే మంచిదిరా నాన్న. అమ్మమ్మ చాలా కలవరిస్తోంది నీకోసం...''

''అమ్మమ్మ చాలా గట్టిదమ్మా. ఏం కాదు. నువ్వేం భయపడకు. మంచి నర్సింగ్‌హోంలో చేర్పించి మంచి పనిచేశావు. డబ్బు ఎంత కావాలో చెప్పు వెంటనే పంపిస్తా. మేం రావాలంటే అంత త్వరగా కుదరదమ్మా. అందులోనూ అత్తగారు, మామగారు కూడా ఇక్కడే వున్నారు.''

''అందరూ రావడానికి కుదరకపోతే వారం రోజులు సెలవు పెట్టి కనీసం నువ్వయినా వచ్చి కన్పించరా నాన్న. అమ్మమ్మను చూస్తే జాలేస్తోంది.''

''నిజమేనమ్మా... అమ్మమ్మంటే నాకూ ప్రాణమే. ఇక్కడ నుంచి బయలుదేరాలంటే ఎన్ని సర్దుబాటు చేసుకోవాలి. అర్థం చేసుకో....''

''అమ్మమ్మ చాలా నీరసించి పోయింది. ఏదైనా జరిగితే ఈ జన్మలో మళ్లీ చూడలేవు.'' దుఃఖం గొంతులో కదలాడింది.

''ఏమీ కాదులే అమ్మ. ముసలాళ్లు రోజుల తరబడి మంచంలో వుంటరు కంగారు పడకు''

''ఏమోరా... అమ్మమ్మ ఆరోగ్యం రోజుకో రకంగా వుంటోంది. నవువ్వ ఒక్కసారి వచ్చి వెడితే మా కందరికి సంతోషంగా వుంటుంది.''

''సరే చూస్తాలే.... నీ ఆరోగ్యం జాగ్రత్త. అత్తగారు వెళ్లాక నువ్వు ఇక్కడకు రావాలసి వుంటుంది.''

ఏమీ మాట్లాడలేకపోయింది. వాడిని రమ్మన మని నేను చెబుతుంటే...నేను అక్కడకి రావాల్సి వుంటుందంటాడు. అమ్మ సంగతి ఆలోచించడే'' దుఃఖం గొంతులోకి మరింతగా తన్నుకొచ్చింది.

మర్నాడు అమ్మ మళ్లీ అడిగింది. ''సంధ్యమ్మ మోహనకృష్ణని చూడాలని వుంది. రమ్మని చెప్పవే. నాకు వంట్లో బాగాలేదని చెప్పు. వెంటనే పరుగెత్తుకొని వస్తాడు. వాడికి చింతచిగురు పప్పు బాగా ఇష్టం కదా. చేసిపెట్టాలి.''

రాత్రి ఫోన్ చేసిన సంగతి అమ్మకు చెప్పలేకపోయింది. కళ్లల్లో కాటుకలా కదిలిన కన్నీటిని రెప్పల్లో దాచుకుంటూ, ''ఇప్పుడు మనకు పగలు కదా. వాళ్లకి రాత్రి. నిద్రపోతుంటారు'' అంది.

''ఔనాను. ఇప్పుడు వాళ్లకి రాత్రి కదా. లేపొద్దులే. మళ్లీ వాడికి నిద్ర పట్టదు. సాయంత్రం ఆరింటికి చెయ్యి. వాడు పొద్దున్నే నిద్ర లేస్తాడు''

ఆ సాయంత్రం ఆరు అయ్యి కాకముందే పేచీ పెట్టింది. వెళ్లి త్వరగా ఫోన్ చేసి రమ్మనమని.

తను 'సరే' అంటూ అలానే కూచుండిపోయింది.

అమ్మ తనని తొందర చేసింది. 'ఫో... త్వరగా ఫోన్ చెయ్యి. నువ్వంటే ఒకసారి వెళ్లి చూసి వచ్చావు. నెల్లాళ్లు నీ కొడుకు, కోడలితో గడిపి వచ్చావు. సరిపోయిందా? మరి నా సంగతి. వాడిని చూడక నా కళ్లు చీకట్లు కమ్మినట్లుగా అయ్యాయి. అమ్మాయిని, మనుమడిని తీసుకుని, నెల్లాళ్లు వుండేలా సెలవు పెట్టి రమ్మనమని చెప్పు. ఆస్పత్రిలో వున్నానని, మందులు తింటున్నానని చెప్పు''

నీరసం వచ్చినట్లయింది. అమ్మ మాటగా చెప్పాలని నిర్ణయించుకొని నెమ్మదిగా ఎస్టీడి బూత్ దగ్గరకు నడిచింది. మోహనకృష్ణకు విషయం మరోసారి వివరించింది.

''సరే అమ్మా. వస్తాలే. అయితే వెంటనే కుదరదు. ఈ వారం మాకు లాంగ్ హాలీ డేస్. నాలుగు కుటుంబాల వాళ్లం అందరం కలిసి హవాయి ద్వీపాలు చూడ్డానికి వెళదామని ప్లాన్ చేసుకున్నాం. ఇప్పుడు మేం వెళ్లకపోతే ప్లానంతా అప్‌సెట్ అవుతుంది. బావుండదు. వచ్చాక ప్రాజెక్ట్ వర్క్ చూసుకొని బయలుదేరుతాను. అమ్మమ్మని జాగ్రత్తగా చూసుకో. డాక్టర్‌గార్కి నేను చెప్పినట్లు చెప్పు...''

''అది కాదురా... అసలు అమ్మమ్మ అన్నం సరిగా...''

మధ్యలోనే అందుకుంటూ ''చెప్పాను కదమ్మా వస్తానని ఆఫీసు వర్క్‌లో చాలా టెన్షన్‌తో వున్నాను.'' ఆ స్వరంలో విసుగు.

ఇంకేమీ మాట్లాడలేకపోయింది.

ఆ తర్వాత నాలుగురోజుల్లోనే అమ్మ తనని వంటరిని చేసింది. వెళ్లే ముందు 'మోహనకృష్ణని అడిగానని చెప్పు. నేను చేసిన దానాలు, ధర్మాలు ఫలిస్తే వాడి కడుపున పుడతానని చెప్పు. పిచ్చి సన్నాసి. ఎలా వున్నాడో? శలవు దొరికిందో లేదో. వాళ్లు దూరంగా వున్నారు. ఏ కష్టం వచ్చినా మనకు చెప్పరు. బాగున్నామనే చెపుతారు. అమ్మాయి నవత బావుందంటావా? నా మునిమనుమడిని కళ్లారా చూడనే లేదు.వాడు పంపిన ఫోటోలు ఒక్కసారి ఇలా ఇవ్వు...''

ఇప్పటికి ఆ ఫోటోలు ఎన్ని సార్లు చూసిందో? ఎప్పుడూ దగ్గర వుండాల్సిందే.

అమ్మ ధోరణి అర్థం చేసుకుని, మళ్లీ మరోసారి ఫోన్ చేసింది. కానీ ఫోన్ అందనే లేదు. హవాయి వెళ్లినట్లు వున్నారు.

శోకతప్త హృదయంతో ఆత్మీయుల అండతో, అమ్మ శవంతో ఊరు చేరింది. పదిరోజుల తరువాత ఫోన్ చేశాడు. ''అమ్మమ్మ లె వుందంటూ...''

అప్పటికీ అన్ని కార్యక్రమాలు ముగింపులో వున్నాయి. అదే చెప్పింది.

''బాధపడకమ్మా. నేనిలా జరగుతుందని అనుకోలేదు. అయినా పెద్ద వయసు కదా. దినం బాగా చేయించు. ఏ లోటూ రానీయ్యకు.''

''సరే'' అంది నిర్లిప్తంగా తాను.

''నేనిప్పుడు వచ్చినా వృథాయే. అందుకోలేను. మన వాళ్లందరూ అక్కడే వున్నారుగా.''

''ఔను...''

''కార్యక్రమాలన్నీ అయ్యాక, అన్నీ సెటిల్ చేసుకొని సిద్ధంగా వుండు. టిక్కెట్ బుక్ చేస్తాను. మా అత్తగారు, మామగారు వెళ్లే ముందే నువ్వు ఇక్కడికి వస్తే బాగుంటుంది. ఆర్నెల్లు వుండొచ్చు. నీ మనుమడితో ఆడుకోవచ్చు.''

''సరే చూద్దాం.''

''నీకు కోపం వచ్చినట్లుంది.''

''......''

''నా పరిస్థితి కూడా నువ్వు అర్థం చేసుకోవాలి. నేను తప్ప అందరూ అక్కడే వున్నారు కదా. నేను లేననే విషయాన్ని భూతద్దంలో పెట్టుకొని చూస్తూ అదే పనిగా బాధపడకు.''

''నీ మీద దిగులుతోనే అమ్మమ్మ పోయిందని అందరూ అంటున్నారు.''

''అమ్మమ్మంటే నాకు మాత్రం మమకారం లేదా? నువ్వు ఇక్కడికి వస్తే వూరు మారినట్లుంటుంది. నీ మనుమడిని చూసుకుంటూ అన్నీ మర్చిపోవచ్చు.''

''సరే'' దూరంగా వున్న వాడిని ఏమీ అనలేని పరిస్థితి. అమ్మను పోగొట్టుకొన్నట్టయి, శూన్యంలో దుర్భరంగా వున్న స్థితి తనది.

కళ్లంట నీళ్లు తిరిగాయి. చెంపల మీదకు జలజలారాలాయి. అప్పుడే అటుగా వచ్చిన ఎయిర్ హోస్టెస్, ఏం జరిగిందన్నట్లుగా భుజం తట్టింది ఆప్యాయంగా. అంతలోనే గబుక్కున వెళ్లి నాలుగు పేపర్ నాప్‌కిన్స్ తెచ్చి ఇచ్చింది. కళ్లు తుడుచుకోమన్నట్లు. ఆరెంజ్ జ్యూస్ తీసుకు వచ్చి తాగమని బలవంతం చేసింది. అనునయిస్తున్నట్లుగా.

'అమ్మ, అమ్మమ్మగా తన బాధ్యతల్ని సక్రమంగా నెరవేర్చింది. మరి తను కూడా నాయనమ్మగా తన బాధ్యతల్ని నిర్వర్తించాలి. వాడి కోసమే ఈ ప్రయాణం. లేకపోతే ఖరీదైన క్రష్‌లో నలిగిపోతాడు. నాన్న లేని నేను వైధవ్యంతో పుట్టింటికి చేరితే ఆప్యాయంగా ఆర్తిగా అక్కున చేర్చుకుంది అమ్మ.

తాతలనాటి పాత పెంకుటింట్లో అమ్మ, కూతురులా కాక, అక్క చెల్లెళ్లుగా, ప్రాణస్నేహితుల్లా తోడునీడగా తిరిగారు. పడుకోబోయే ముందు ప్రతి బియ్యపు గింజ నీకు సగం, నాకు సగం అన్నట్లు వ్యవహరించారు. కష్టాల్ని, సుఖాల్ని సమానంగా అరమరికలు లేకుండా పంచుకున్నారు. అమ్మ ఆ పెంకుటింటిని, విశాలమైన ఆ పెరడుని ఎంత శుభ్రంగా వుంచేది? 'శుభ్రతే లక్ష్మీదేవి' అంటూ తెల్లవారు ఝామునే చీపురు పట్టేది. కళ్లాపుజల్లి ముగ్గులు తీర్చేపని తనది.

పెరట్లో జామ చెట్టు, కరివేపాకు చెట్టు, గానుగ చెట్టు అమ్మని మరిచిపోనివ్వవు. జామచెట్టు మీద

ప్రతి ఉదయం వాలే రామచిలుకల్ని చూస్తే అమ్మకు ఎంత సంతోషమో?''చూశావే సంధ్యా, ఈ భడ వలు అప్పుడే తయారయ్యాయి. ఎంగిలి చేయ కుండా ఒక్క జామకాయ కూడా వదలవే.'' అనేది.

గానుగ చెట్టంటే అమ్మకు ఎంతో ఆపేక్ష. చెట్టు చుట్టూరా ముత్యాలు పర్చినిట్లు తెల్లని, సన్నని గానుగ పువ్వులు బుట్టలోకి ఎత్తి పారబోయాల్సి వచ్చేది. ఒక రోజు తను అన్నది '' ఈ చెట్టు కొట్టించే ద్దామమ్మా. ఎత్తి పారపొయ్యలేక ఛస్తున్నాం.''

''ఆ మాట అనకే సంధ్యమ్మ. గానుగ చెట్టు వైద్యానికి శ్రేష్టమని, ఆ చెట్టు మీద నుంచి వీచే గాలి వంటికి మంచిదని మీ అయ్య అనేవాడు.'' గానుగ చెట్టు దగ్గరగా రెండు నవారు మంచాలు పక్కప క్కగా ఆన్చి వేసుకొని వెన్నల రోజుల్లోను, చీకటి రోజుల్లో నక్షత్రాలు చూస్తూ ఎన్నో కబుర్లు చెప్పుకు నేవారు. భోజనాలయ్యాక ఇరుగుపొరుగు బంధు వులు చేరి మంచాల మీద కూచొని ప్రతి ఇంటి కబురూ చెప్పుకుంటుంటే కాలమే తెలిసేది కాదు. ప్రతి ఇంటి బాధా మా అందరిదీ. ప్రతి ఇంటి సంతోషమూ మాకందరికీ ఆహ్లాదకరం. ఏ ఇంట శుభకార్యం జరిగినా అందరం తలో చెయ్యి వెయ్యాల్సిందే.

అమ్మ కాశీ విశ్వనాధుడిని చూడాలని తపనప డితే అమ్మ, తను, మంజు వదినె, సరస్వతి పిన్ని, బాబాయి అందరం కలిసి వెళ్లి ఎంత హాయిగా దైవదర్శనం చేసుకొని సుఖంగా తిరిగి వచ్చాం. కాశీ వెళ్లడానికే రెండురోజులు పట్టింది. కానీ ఆ రైలు ప్రయాణం ఎంత బావుంది? రైలు వెంటే నడిచిన పచ్చని పొలాలు, కమలాతోటలు, వంపులు తిరి గిన కాలువలు, కొండ మలుపులు, ప్రకృతి నయన మనోహరం!సొగసుల సుకుమారి ప్రకృతి కన్యను సృష్టించి, భగవంతుడు మనిషికి మధురానుభూ తులకు, ఆహ్లాదాన్ని అందుకోమని, అద్భుతమైన వరాన్ని ప్రసాదించాడు.

ఈ విమానంలో ప్రయాణిస్తే ఏముంది? దూది పింజల్లాంటి మబ్బుల మధ్య నుంచి ప్రయాణం. కాళ్లు ముడుచుకొని ఇంట్లో కుర్చీలో కూచున్నట్లే. సుదూర తీరాల్ని దగ్గర చేసే ఈ ప్రయాణాలు, మనుషుల అందరంగాలను, మమ తానుమంధాలను దూరం చేస్తున్నాయి. గాలిని కోసుకుంటూ ప్రయాణించే విమాన వేగం మను షుల జీవన సరళిలో వేగాన్ని పెంచి తన వునికిని మరిచిపోయేలా చేస్తోంది.

రేపు నా మనుమడి జీవన వేగం ముందు ఈ నాయనపమ్మ గాలిలో తేలిపోయే దూదిపింజ. నాయనమ్మగా నా అవసరం ఎప్పుడున్నా పక్షిలా శ్రీఘ్రంగా వాలతాను. నా అవసరం తీరిన మరు క్షణం పొలెం చేరతాను.

నాకు తెలుసు. కోడలింట్లో నాకెన్నో ఇబ్బందులు. వాళ్లు ఈ తరం వాళ్లు. నేను, అమ్మ పాత తరం వాళ్లం. పొంతన కుదరడం కష్టం. కానీ తప్పదు.

పక్క సీట్లో వున్న అమెరికన్ అమ్మాయి పలక రించింది.

వచ్చీరాని ఇంగ్లీషులో, అర్ధమయి కానీ వుచ్ఛా రణలో సంభాషణ.

ఆఅమ్మాయి ఢిల్లీ నుంచి, శాన్‌ఫ్రాన్సికోకి వెడు తోంది మూడు వారాల కోసం. బృందావనంలో రెండేళ్లుగా వుంటోంది. ఓ గురూజీ ద్వారా కృష్ణ భక్తురాలిగా మారిపోయింది. భారతదేశం ఎంతో నచ్చిందని, బృందావనంలో పంచే ప్రసాదం రస గుల్లా, గులాబ్‌జాం, అడ్డు చాలా బావుంటాయని చెప్పింది.మాంసాహారం మానివేసానని, కిచిడి చాలా బావుంటుందన్నది.


బృందావనానికి తప్పకుండా రమ్మనమని, అక్కడ రాధాకృష్ణులను చూస్తే అన్ని బాధలు మర పుకు వస్తాయని, ఎటువంటి ఇబ్బందీ రాకుండా చూసుకుంటానని చెప్పింది. కింద వున్న బ్యాగ్‌లో నుంచి లాప్‌టాప్ తీసి, బృందావనంలోని మధుర మైన సుందర దృశ్యాలను చూపించింది. కమ నీయం యమునా తీరం. రాధా బలరామ్ సహిత కృష్ణ సౌందర్యాన్ని విశదీకరించే ఎన్నో ఫోటోలను చూపించింది. ఆ అమెరికన్ అమ్మాయి బెవల్లి పేరి ప్పుడు సావిత్రి. గురూజీ పెట్టినపేరు.

ఆ అమ్మాయి చెబుతున్నవి వింటుంటే మనసు కొంత తేలిక పడినట్లయింది. తప్పక బృందావనా నికి వెళ్లాలనే అనిపించింది. కానీ వెళ్లను. నాకు ఆల సైన బృందవనం పొలెంలోని ఆ పాత పెంకుటిల్లే.

ఆ పెంకుటింట్లో మా అమ్మ వుంది. నాకు అమ్మకావాలి. అమ్మ సంధ్యమ్మ అని నన్ను పిల వవా? నీ వళ్లోసేదతీరాలని వుందమ్మా. అమ్మ నిన్ను వంటరిగా వదలివచ్చాను. నాకోసం ఎదురు చూస్తున్నావా? అమ్మా నువ్వు కావాలమ్మా. 'మూ సుకున్న కనురెప్పల మధ్య కన్నీరుపొంగి పొర్లింది.

ఈవిమానం వెనక్కి తిరిగితే ఎంత బావుండు??

★



## అమ్మకానికి తల్లిపాలు

కాదేది కవితకి అనర్హం అన్నాడో మహాకవి. ఆయన్ని ఆదర్శంగా తీసుకుందేమో ఓ మాతృమూర్తి, తన పాలను రెండు వందల డాలర్లకు అమ్మకానికి పెట్టింది. మార్ధాహెల్లర్ అనే 22 సంవత్సరాల యువతి ఔన్సు తల్లి (తన)పాలను 200 డాలర్లకు అమ్ముతానని పేపర్లో ప్రకటన ఇచ్చింది. ఇంతకీ అసలు సంగతేమిటంటే... మార్ధా హెల్లర్‌కి నాలుగు నెలల కూతురు వుంది. ఆమె తాగాగా పొంగి పొర్లుతున్న స్తన్యాన్ని వృధాగా పారబోయడం ఇష్టం లేక ఈ పనికి పూనుకున్నట్లు ఆ మాతృ మూర్తి సెలవిస్తోంది. గత ఆగస్టు నుంచి 'లౌ మదర్ మిల్క్ బ్యాంక్'కి తన పాలను వంద ఔన్సులు ఇవ్వడం ప్రారంభించింది. తల్లిపాలను ఆరునెలల వరకు నిల్వ చేయవచ్చని నిపుణులు చెపుతున్నారు.